ప్రణాళికా రచన.. వ్యూహాలు, లక్ష్యాలు

ప్రణాళిక, ప్రణాళికా రచన అర్థాలు

ఈ రెండు పదాలు ఒకే అర్థాన్నిస్తాయి. కానీ వాటిమధ్య తేడా ఉంటుంది. ప్రణాళికా రచన విశాల భావన. దానిలో ప్రణాళిక అంతర్భాగం. ప్రణాళికా వేత్తలకు ప్రణాళిక ఒక నమూనా లేదా ఒక పుస్తకం. శాస్త్రీయ అంచనాతో వనరులను సేకరించి వాటిని ప్రాధాన్యతలపరంగా కేటాయించడమే ప్రణాళికా రచన. వనరులు అపరిమితంగా లభించవు కాబట్టి కొద్ది వనరులతో ఎక్కువ ఫలితాలను సాధించడమే ప్రణాళికా వ్యూహాల ఆశయం.

ప్రణాళికా రచన చరిత్ర

ప్రపంచంలో తొలిసారి జాతీయస్థాయిలో 1917 బోల్షెవిక్ (Bolshevik) లేదా కమ్యూనిస్టు విప్లవం తరువాత అప్పటి సోవియట్ యూనియన్ ప్రణాళికాయుత పురోగతిని సాధించింది. ఆ దేశం పంచవర్ష ప్రణాళికలను పాటించింది.

భారత్‌లో 1951 నుంచి ప్రణాళికాయుత అభివృద్ధి ప్రారంభమైంది. అయితే 1951 పూర్వం భారతీయులకు ప్రణాళికారచన అవసరం, అర్థం తెలుసుకొనే ప్రయత్నాలు జరిగాయి. సర్ ఎం.విశ్వేశ్వరయ్య 1934లో 'భారతదేశం ప్రణాళికాయుత అభివృద్ధి' అనే పుస్తకాన్ని ప్రచురించాడు. జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన 1938లో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రణాళికా కమిటీని నియమించింది. బొంబాయికి చెందిన ఎనిమిది మంది పారిశ్రామిక వేత్తలు భారత్‌లో 1944లో భారీ మౌలిక పరిశ్రమల స్థాపన ద్వారా వృద్ధిని తలపెట్టే ''బొంబాయి ప్రణాళిక''కు రూపకల్పన చేసారు. ఇదేకాలంలో మరో రెండు ప్రయత్నాలు జరిగాయి. సర్వోదయ అధ్వర్యంలో ఎస్.ఎం. అగర్వాల్ ''గాంధీయ ప్రణాళిక''ను, హిందూమజ్దూర్ సభ నాయకత్వాన ఎం.ఎన్.రాయ్ ''ప్రజల ప్రణాళిక''ను రూపొందించారు. ఈ ప్రయత్నాలన్నీ రాబోయే పంచవర్ష ప్రణాళికలకు నాంది పలికి, సులభతరం చేసాయి.

ప్రణాళికా సంఘం, జాతీయ అభివృద్ధి మండలి (ఎన్.డి.సి.), ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్)

రాజ్యాంగాన్ని 1950లో ఆమోదించిన తర్వాత, అదే ఏడాది ప్రణాళిక సంఘాన్ని స్థాపించారు. 1952లో ఎన్‌డిసి (నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్)ను నెలకొల్పారు. ఈ రెండూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పడిన శాసనీయం కాని సంస్థలు. అయితే భారత ఆర్థిక కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ. రాష్ట్రపతి ప్రతి ఐదేళ్లకోసారి ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల వాటాను, గ్రాంట్లను బదిలీ చేయటానికి సూత్రాలను, సిఫార్సులను ఆర్థిక సంఘం చేస్తుంది. ఇంతవరకు 12 ఆర్థిక సంఘాలు తమ బాధ్యతలు నిర్వహించాయి. 13వ ఆర్థిక సంఘం విజయ్ కేల్కర్ చైర్మన్‌గా 2007, నవంబర్ 14న అవతరించింది. ఏప్రిల్ 1, 2010 నుంచి మార్చి 31, 2015 ఐదేళ్ళ కాలానికి కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీకి సంబంధించి కమిషన్ సిఫార్సులు చేస్తుంది. ప్రణాళికా సంఘం రూపొందించిన ముసాయిదా పంచవర్ష ప్రణాళికను ఆర్థిక సంఘం ముందే పరిశీలించి తగు సూచనలు చేయవచ్చు. 12వ ఆర్థిక సంఘం రాష్ట్రాల ఆర్థిక సామర్థ్యానికి 15 శాతం, 7.5 పాయింట్లు ఆర్థిక క్రమశిక్షణకు, 7.5 పాయింట్లు పన్నుల వసూలు సామర్థ్యానికి, జనాభాకు 25 శాతం, తలసరి ఆదాయానికి 50 శాతం వెయిటేజి పాయింట్ల ప్రాతిపదికన రాష్ట్రాలకు కేంద్ర నిధుల వాటాలను ప్రకటిస్తుంది.

డా।। సి. రంగరాజన్ అధ్యక్షతన 12వ ఆర్థిక సంఘం 2005-2010 కాలానికి కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే ఆర్థిక సహాయంపై కింది సూచనలు చేసింది.

- 2005 ఏప్రిల్ 1 నుంచి 29.5-30.5 శాతానికి కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటాని పెంచడం
- పన్నుల వాటా రూ.6,13,112 కోట్లు, గ్రాంట్ల కింద రూ. 1,42,639 కోట్లు, మొత్తం రూ. 7,55,752 కోట్లు రాష్ట్రాలకు బదలాయింపు
- స్థూలదేశీయోత్పత్తిలో పన్నుల శాతాన్ని 17.6 శాతానికి పెంచడం
- సంస్థలు విధించే షరతులకు లోబడి విదేశీ నిధులను రాష్ట్రాలకు బదలాయించటం.
- కేంద్ర, రాష్ట్రాల రెవెన్యూ లోటును జీరోస్థాయికి 2009 నాటికల్లా సాధించడం - దీనికి సంబంధించి ప్రతిరాష్ట్రం ఒక ఆర్థిక జవాబుదారీ చట్టాన్ని తీసుకురావాలి, ఆర్థికలోటును రాష్ట్ర స్థూలోత్పత్తిలో 3 శాతానికి తగ్గించడం.
- దేశంలో పారిశుద్ధ్యం, తాగునీరు సౌకర్యాల కోసం స్థానిక సంస్థలకు 15 వేల కోట్ల రూపాయలు గ్రాంట్ల రూపంలో రాష్ట్ర పంచాయతి వ్యవస్థ ద్వారా మంజూరు మొదలైనవి

ప్రణాళికల సాంఘిక-ఆర్థిక ఉద్దేశాలు

ఇంతవరకు పూర్తయిన 10 పంచవర్ష ప్రణాళికలలో కొన్ని ముఖ్యమైన సాధారణ ఉద్దేశాలున్నాయి, అవి:

- **వృద్ధి:** జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు వృద్ధి ప్రక్రియను త్వరితం చేయడం.
- **ఆధునికీకరణ:** కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉత్పాదకతను పెంచి, ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం.

- **స్వావలంబన:** దేశీయ పరిజ్ఞానంతో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకొని స్వదేశీ ఉత్పత్తులను ఎక్కువ చేసి దిగుమతి ప్రత్యామ్నాయాలు (Import Substitution) సాధించడం.
- **ప్రాంతాల మధ్య సమతౌల్య అభివృద్ధి:** దేశంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధిచేసి రాష్ట్రాల మధ్య ఉన్న అంతరాలను తొలగించడం.
- సాంఘిక న్యాయంతో కూడిన అభివృద్ధి చెందిన సమాజంగా రూపొందించటం, ఆర్థిక వ్యత్యాసాలు తొలగించడం.

పంచవర్ష ప్రణాళిక	కాలం
ఒకటో ప్రణాళిక	1951-56
రెండో ప్రణాళిక	1956-61
మూడో ప్రణాళిక	1961-66
మూడు వార్షిక ప్రణాళికలు	1966-69
నాలుగో ప్రణాళిక	1969-74
ఐదో ప్రణాళిక	1974-79
వార్షిక ప్రణాళిక	1979-80
ఆరో ప్రణాళిక	1980-85
ఏడో ప్రణాళిక	1985-90
రెండు వార్షిక ప్రణాళికలు	1990-92
ఎనిమిదో ప్రణాళిక	1992-97
తొమ్మిదో ప్రణాళిక	1997-02
పదో ప్రణాళిక	2002-07
పదకొండో ప్రణాళిక	2007-12

(అమలులో ఉంది)

ఒకటో ప్రణాళిక (1951-56)

ఆహార కొరత, శరణార్థులు ఎక్కువ సంఖ్యలో రావడం, వారికి పునరావాసం, ద్రవ్యోల్బణ పరిస్థితులు, దేశవిభజన, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దేశ ఆర్థికవ్యవస్థలో అసంతులిత సమస్యల నేపథ్యంలో మొదటి ప్రణాళిక ప్రారంభమైంది.

ధ్యేయాలు

త్వరితగతిన వ్యవసాయరంగ అభివృద్ధి ద్వారా ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించటం, ద్రవ్యోల్బణాన్ని అదువు చేయటం, దేశంలో అన్ని రంగాల సమగ్ర అభివృద్ధి - దీనికి అవసరమైన రవాణా, కమ్యూనికేషన్ల వ్యవస్థను అధిక కేటాయింపులతో అభివృద్ధి చేయటం.

కేటాయింపులు

మొత్తం ప్రణాళికా వ్యయం 1960 కోట్లు కాగా, దీనిలో సింహభాగం 26.4 శాతం (518 కోట్లు) రవాణా, కమ్యూనికేషన్ల రంగానికి, నీటిపారుదల, వరదల నియంత్రణ రంగానికి 22.2 శాతం కేటాయించారు. భారీ పరిశ్రమల గురించి పెద్దగా ప్రస్తావన లేని మొదటి ప్రణాళికలో కేవలం 2.8 శాతం నిధులు ఖనిజాల అభివృద్ధికి కేటాయించారు. మొదటి ప్రణాళిక హారడ్-డోమర్ నమూనాగా భావిస్తారు. ఈ ప్రణాళిక ప్రాధాన్యత వ్యవసాయరంగం అభివృద్ధిగానే భావిస్తారు.

రెండో ప్రణాళిక (1956-61)

మహలనోబిన్ మోడల్ ఆధారంగా భారీపరిశ్రమల అభివృద్ధి వ్యూహం ద్వారా పారిశ్రామికీకరణ సాధించాలనే లక్ష్యంతో ఈ ప్రణాళికను రచించారు. ఈ ప్రణాళికను కొందరు నెహ్రూ, ఫెల్డ్‌మన్ నమూనా అంటారు.

ఈ ప్రణాళిక ఆరంభంనాటికి ఆర్థిక స్థిరత్వం (Economic Stability) సూచనలు కనిపించాయి. ద్రవ్యోల్బణ స్థితిలో మెరుగు, ఆహారధాన్యాల ఉత్పత్తిలో లక్ష్యాల సాధన రెండో ప్రణాళిక అమలుకు ప్రోత్సాహకాలుగా పరిణమించి భారీ పరిశ్రమల అభివృద్ధిపై ప్రభుత్వ దృష్టిని మరల్చాయి. రెండో ప్రణాళికలో మొత్తం ప్రభుత్వ రంగ కేటాయింపుల్లో 20.1 శాతం అంటే రూ. 938 కోట్లు భారీ పరిశ్రమలపై వెచ్చించారు. అన్ని రంగాల అభివృద్ధికి అవసరమయ్యే మౌలికరంగమైన రవాణా, కమ్యూనికేషన్లపై 27 శాతం, వ్యవసాయ రంగంపై 11.7 శాతం ఖర్చు ప్రభుత్వ రంగ కేటాయింపులలో పొందుపరిచారు.

మూడో ప్రణాళిక (1961-66)

ఈ ప్రణాళికలో స్వావలంబనకు ప్రాధాన్యమిచ్చారు. మొదటి రెండో పంచవర్ష ప్రణాళికల అనుభవం దృష్ట్యా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కొనసాగింది. అంతేకాకుండా రెండో ప్రణాళికలో భారీ పరిశ్రమలకు ఇచ్చిన ప్రాధాన్యతను మూడో ప్రణాళికలో కూడా కొనసాగించారు. రెండో ప్రణాళికతో పోలిస్తే వ్యవసాయరంగానికి రూ. 549 కోట్ల నుంచి రూ. 1089 కోట్లు, పరిశ్రమల రంగానికి రూ. 938 కోట్ల నుంచి 1726 కోట్లకు రెండురెట్లు పెరిగింది.

ఉత్పత్తిదారుల వస్తువులు(capital goods) స్టీలు, యంత్రాలు, దేశంలోనే ఉత్పత్తి చేసి, దిగుమతులు తగ్గించుకోవటం, అదేవిధంగా వినియోగదార్ల వస్తువుల ఉత్పత్తులతో ఎగుమతుల స్థాయి పెంచటం వంటి చర్యలతో దేశంలో మొదటి 15 ఏళ్ల ప్రణాళికా చరిత్రలో భారత పరిశ్రమల స్వరూపంలో నిర్మాణాత్మకమైన మార్పులు జరిగాయి. మొదటి, రెండో ప్రణాళికల మాదిరిగానే రవాణా, కమ్యూనికేషన్ల రంగానికి అత్యధిక నిధులు రూ. 2112 కోట్లు కేటాయించారు. దీనిలో రూ. 890 కోట్లు రైల్వేల అభివృద్ధికి కేటాయించారు.

మూడో ప్రణాళికా కాలంలో మన పొరుగు దేశాలైన చైనా(1962), పాకిస్తాన్ (1964)తో జరిగిన యుద్ధాలు ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. దీంతో ప్రణాళికా లక్ష్యాలు అభివృద్ధి పథం నుంచి రక్షణ పథం వైపు మళ్లాయి.

వార్షిక ప్రణాళికలు (1966-69)

ఈ కాలాన్ని 'ప్రణాళికా సెలవు' (Plan Holiday)గా పరిగణిస్తారు. రెండేళ్ల కరవు, రూపాయి విలువ తగ్గిపోవడం, ద్రవ్యోల్బణంతో కూడిన ఆర్థిక మాంద్యం (Inflationary recession), యుద్ధాల వల్ల

చితికిన ఆర్థికవ్యవస్థ వంటి పరిస్థితులు నాలుగో ప్రణాళిక ప్రారంభాన్ని వాయిదా వేయించాయి. ఈ మూడేళ్లలో రూ. 6625 కోట్లు ప్రణాళికా ఖర్చు కాగా దీనిలో 22.8 శాతం భారీ పరిశ్రమలు, ఖనిజాలపై, 18.5 శాతం రవాణా, కమ్యూనికేషన్లపై అధిక మొత్తంలో ఖర్చు చేసారు.

దేశంలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ కొరత పరిశ్రమల అభివృద్ధిపై ప్రభావం చూపింది. విద్యుత్ ఇంధనం సమస్యను అధిగమించటానికి 18.3 శాతం నిధులు ఖర్చుపెట్టి ఈ ప్రణాళిక ప్రత్యేక దృష్టిని సారించింది.

పంచవర్ష ప్రణాళికలు

నాలుగో ప్రణాళిక (1969-74)

ఈ ప్రణాళికా కాలంలో సంతులిత ప్రాంతీయాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ఉంది. నిలకడతో కూడిన అభివృద్ధి, సామాజిక న్యాయం క్రమేపి స్వావలం బన, 5.5 శాతం ఆర్థిక వృద్ధిరేటు ఇతర లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ ప్రణాళికలో వ్యయం రూ. 15,902 కోట్లుగా భావించి నప్పటికీ, రూ. 15779 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. ఈ ప్రణాళికలో కూడా 19.5 శాతం నిధులు (రూ.3080 కోట్లు) రవాణా, కమ్యూనికే షన్ల మీద ఖర్చు చేశారు. ఈ రంగంలో సౌకర్యాల లేమిని ఎప్పుడిక ప్పుడు సమీక్షించి పరిష్కరించకపోతే ఆర్థికవృద్ధికి ఇది ప్రతిబంధ కంగా మారుతుందని గ్రహించారు. తర్వాత ప్రాధాన్యతలో 18.6 శాతం (రూ.2932 కోట్లు) విద్యుత్ రంగానికి కేటాయించారు.

విద్యుత్ రంగంలో ఉత్పత్తి ప్రణాళికా అవసరాల మేరకు సంతృప్తిక రంగా ఉన్నప్పటికీ, భవిష్యత్‌లో అభివృద్ధి అవసరాలకు విద్యుత్ ఉత్ప త్తితో పాటు సరఫరా, పంపిణీకి సంబంధించిన మౌలిక విషయాలపై కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. వ్యవసాయరంగానికి 14.6 శాతం నిధులు కేటాయించారు. నీటిపారుదల, వరదల నియంత్రణకు రూ. 1354 కోట్లు ఖర్చుచేశారు. మొదటి మూడు ప్రణాళికలతో పోలిస్తే నాలుగో ప్రణాళికలో అధికశాతం వ్యవసాయంపై వ్యయం చేసారు.

ఐదో ప్రణాళిక (1974-79)

ఈ ప్రణాళిక ఆరంభం నాటికి ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణ పరిస్థి తులు నెలకొన్నాయి. దీనికి కారణం ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరగటం. దీనిలో మన పరిశ్రమలకు అవసరమైన ఇంధనం ఉత్పత్తులను సాధించేందుకు విద్యుత్ రంగానికి రూ. 7400 కోట్లు (మొత్తం ప్రణాళికా కేటాయింపులో 18.8 శాతం) కేటాయిం చారు. తర్వాత ప్రాధాన్యతలో 17.4 శాతం నిధులను రవాణా కమ్యూ నికేషన్లు, వ్యవసాయానికి 12.2 శాతం కేటాయించారు. అప్పటికే వివిధ రంగాలలో ఉత్పాదకతా సామర్థ్యాలను పూర్తిగా వినియోగించు కొని అధిక ఫలితాలు సాధించటం, కీలక పరిశ్రమల రంగాలలో అదనపు ఉత్పత్తి సామర్థ్యాలను పెంచి భవిష్యత్‌లో అవసరాలకు సన్నద్ధంకావటం, అధిక జనాభా వాడే సామూహిక ఉత్పత్తులు సాధించి వినియోగ అవసరాలు తీర్చటం మొదలైన అంశాలు ఈ ప్రణాళికలో పొందుపరచారు.

కనీస అవసరాల పథకం
(Minimum Needs Programme)

ప్రాథమిక విద్య, తాగునీరు, గ్రామాల్లో వైద్య సదుపాయాలు, పోషక విలువలు, భూమిలేని వారికి ఇళ్ళ పట్టాలు. గ్రామీణ విద్యుత్, రోడ్లు ఏర్పాటు, మురికివాడల అభివృద్ధి మొదలైనవి ఈ పథకంలో ఉన్నా యి. రూ. 1582 కోట్లు ఈ కార్యక్రమం కోసం ఖర్చుచేసారు.

పేదరికం నిర్మూలన, స్వావలంబన సాధించటం అధిక ఆర్థిక అభి వృద్ధిరేటు, మెరుగైన ఆదాయ పంపిణీ పొదుపు సామర్థ్యం పెంచటం ద్వారా సాధ్యమని భావించారు. 'గరీబీ హఠావో' నినాదం కూడా ఈ ప్రణాళికలోనే ఊపిరి పోసుకుంది. అయితే 1977లో ప్రభుత్వం మారి జనతా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రణాళిక 1977లోనే అర్థాంతరంగా ముగిసింది.

ఆరో ప్రణాళిక (1978-83 - 1980-85)

కొత్తగా అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం అప్పటివరకు దేశం లో అమలైన ప్రణాళికలు నెహ్రూ వియన్ సిద్ధాంతాలకనుగుణంగా ఉన్నాయని, ఆశించిన స్థాయిలో ఉద్యోగిత, జీవన ప్రమాణాలు, ఆర్థిక సమానతలు కల్పించడంలో విఫలమయ్యాని భావించింది. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి ద్వారా లక్ష్యాల సాధనకు 1978-83 కాలానికి ఆరో ప్రణాళికను రూపొందించింది. రోలింగుప్లాన్ మోడల్ ద్వారా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. 1979-80 వార్షిక ప్రణాళికను-రోలింగు మోడల్ ద్వారా అమలు చేసింది.

అయితే 1980లో తిరిగి ఏర్పడిన ఇందిరాగాంధీ ప్రభుత్వం ఆరో ప్రణాళికను(1980-85) ప్రకటించింది. రూ. 97,500 కోట్లు ఈ ప్రణా ళికా కాలానికి ప్రతిపాదించగా రూ. 1,09,291 కోట్లు ఖర్చుచేశారు. ఇంధన రంగానికి అత్యధికంగా రూ. 30,751 కోట్లు (28.1 శాతం) కేటాయించారు. 1978 నుంచి 1979 వరకు క్రూడాయిల్ దిగుమతు లకు మూడురెట్ల ధరను అధికంగా చెల్లించవలసిన పరిస్థితిలో దేశీయ ఇంధన ఉత్పత్తులపై దృష్టి కేంద్రీకరించింది.

ఏడో ప్రణాళిక (1985-90)

ఇంధన రంగానికి ప్రభుత్వ ప్రణాళికా వ్యయంలో 30.5 శాతం కేటాయించటంతో మరోసారి ఈ రంగం ప్రాముఖ్యతను సంతరించు కుంది. పరిశ్రమలరంగం కన్నా వ్యవసాయ రంగానికి ఈ ప్రణాళికలో ఎక్కువ నిధులు కేటాయించారు. రెండు దశాబ్దాలుగా అనుసరిస్తున్న మహలానోబిన్ అభివృద్ధి వ్యూహాన్ని మార్చినట్టైంది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాగునీటి కోసం 22 శాతం నిధులు కేటాయించారు. రవాణా, కమ్యూనికేషన్ల రంగానికి గత ప్రణాళికల్లో అధికశాతం కేటా యిస్తే ఈ ప్రణాళికలో 13.5 శాతం కేటాయించారు. లాభాలు వెంటనే వచ్చే రంగాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

ఎనిమిదో ప్రణాళిక (1992-97)

రాజకీయ స్థిరత, ప్రభుత్వమార్పు కారణాల వల్ల 1990లో ప్రారంభం కావలసిన ఎనిమిదో ప్రణాళిక 1992లో ప్రారంభమైంది. అప్పటికే ప్రణాళికలు మొదలై దేశ ఆర్థిక వ్యవస్థ సుదీర్ఘ ప్రయాణం చేసింది. జనాభాలో యువకులతోపాటు పేదల సంఖ్య కూడా పెరిగింది. ఉద్యోగావకాశాల హెచ్చింపు ఎనిమిదో ప్రణాళికలో కూడా లక్ష్యాలుగా కొనసాగాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయి.

ప్రణాళికా లక్ష్యాలు తిరిగి నిర్వచించాల్సిన అవసరం కూడా నూతన ఆర్థిక విధానం 1991 నేపథ్యంలో వ్యక్తమైంది. మన ఆర్థిక వ్యవస్థ విదేశీ ఆదాయం చెల్లింపుల (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) పరిస్థితి సంక్షోభంలో ఉంది. దేశంలో ఆర్థికమాంద్యం, ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎక్కువ దిగుమతులు, తక్కువ ఎగుమతుల వల్ల సంతులిత దెబ్బతిని స్టాగ్‌ఫ్లేషన్ (Stagflation) ఏర్పడింది.

ఏడో ప్రణాళిక మాదిరిగానే ఇంధన రంగానికి 26.6 అత్యధిక శాతం గతంలోవలె ఈ ప్రణాళికలో కూడా కేటాయించడంతో మన ఆర్థిక ప్రణాళికల్లో ఇంధన రంగానికి ఉన్న ప్రాముఖ్యత తెలుస్తోంది. వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, నీటిపారుదల రంగాలకు 22.2 శాతం అంటే ప్రణాళికా కేటాయింపులలో ఐదోవంతు ఈ రంగానికే కేటాయించడం ప్రాముఖ్యత సంతరించుకుంది.

తొమ్మిదో ప్రణాళిక (1997-02)

ఈ ప్రణాళికలో మొత్తం ప్రభుత్వరంగ వ్యయం రూ. 8,59,200 కోట్లు. ఎనిమిదో ప్రణాళిక కన్నా 48 శాతం ఎక్కువ. కానీ ఈ ప్రణాళికలో రూ. 9,41,041 కోట్లు ఖర్చు చేశారు. 23.3 శాతం ఇంధన రంగానికి వెచ్చించారు.

ప్రైవేటురంగ ప్రాధాన్యం

ప్రభుత్వరంగ కేటాయింపుల్లో పరిశ్రమల రంగం వాటాను గత ప్రణాళికల్లో పరిశీలిస్తే... ఐదో ప్రణాళిక వరకు 20-22 శాతం వరకు ఉంటే, తొమ్మిదో ప్రణాళికా కాలానికి 6.6 శాతానికి పడిపోయింది. దీనికి కారణాలు పరిశ్రమల అభివృద్ధిలో నూతన ఆర్థిక సంస్కరణలు ఊపందుకోవడం, ప్రభుత్వం క్రమేపి పరిశ్రమల రంగం నుంచి నిష్క్రమిస్తూ ఈ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయటం. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి (13.1%). నీటి పారుదల, వరదల నివారణ(9.02%)కు సంబంధించి తొమ్మిదో ప్రణాళికలో మొత్తం 22.1 శాతం నిధులు కేటాయించి ఉద్యోగాల కల్పన, ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

పదో ప్రణాళిక (2002-07)

పెరుగుతున్న ఆర్థికవృద్ధి అవసరాల దృష్ట్యా ఇంధన రంగానికి 26.4 శాతం అత్యధిక నిధులు కేటాయించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల రంగాలకు మొత్తంగా 18.5 శాతం నిధులు కేటాయించారు.

పరిశ్రమల రంగానికి సంబంధించి ప్రభుత్వ రంగ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మరింత వేగవంతమై కేవలం 3.8 శాతంగా మొత్తం పెట్టుబడుల్లో ఉంది. ఇతర రంగాలైన సాంఘిక సేవలు, మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రణాళికా కేటాయింపులలో 29.7 శాతంతో గత ప్రణాళికల కన్నా పదో ప్రణాళిక ముందంజలో ఉంది.

పదకొండో ప్రణాళిక (2007-12)

ప్రభుత్వ పరంగా రూ. 36,44,718 కోట్లు కేటాయించారు. దీనిలో సింహభాగం 18.2 శాతం రవాణా రంగానికి, 19 శాతం ఇంధన రంగానికి, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి నీటిపారుదల, స్పెషల్ ఏరియా ప్రోగ్రాం రంగాలకు 18.6 శాతం కేటాయించారు.

సామాజిక రంగాలైన విద్య, వైద్యం, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి, ఇతర రంగాలపై మొత్తంగా 30.9 శాతం నిధులు కేటాయించారు. పరిశ్రమలకు సంబంధించి వాటి అభివృద్ధి బాధ్యతను నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రైవేట్ రంగానికే వదిలివేయడం వల్ల ప్రభుత్వ కేటాయింపులలో పరిశ్రమల వాటా కేవలం 4.5 శాతంగా ఉంది.

ఇండికేటివ్ ప్లాన్ - సూచనప్రాయ ప్రణాళిక

దీనిని 1992లో అప్పటి పి.వి. నరసింహారావు ప్రభుత్వం మొదట అమలు చేసింది(ఎనిమిదో ప్రణాళికా కాలంలో). సరళీకృత విధానాలకు అనుగుణంగా ఇండికేటివ్ ప్రణాళికా రచనను రూపొందిస్తారు. ఫ్రాన్స్ వంటి కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు ఈ ప్రణాళికను పాటిస్తున్నాయి.

దీనిలో ప్రణాళికా సంఘం వనరుల కేటాయింపు పాత్రను వహించదు. ప్రజల అవసరాల మేరకు ప్రణాళికను సిద్ధంచేసి, దాని అమలును చాలావరకు ప్రైవేటు రంగానికి అప్పగిస్తారు. ప్రణాళికా సంఘం విధాన ప్రణాళిక గురించి ప్రయత్నిస్తుంది. సంవిధానకర్తగా, సహాయకారిగా బాధ్యతలను ప్రణాళికా సంఘం లేదా ప్రభుత్వం స్వీకరిస్తుంది. వ్యక్తులకు, ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహకాలను కల్పించి ప్రణాళికను అమలు చేస్తుంది.

భారత్.. సామాజిక రంగ అభివృద్ధి

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో తలసరి ఆదాయం వృద్ధి ముఖ్యమైంది. మెరుగైన ఆరోగ్య సేవలు.. విద్యావకాశాలు.. సమానత్వం.. పరిశుభ్రమైన పర్యావరణం.. వంటివి జీవన ప్రమాణ వృద్ధికి సంబంధించిన ముఖ్య లక్షణాలు. గత కొన్నేళ్లుగా పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అమలు చేసిన అనేక పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు.. సంతృప్తికరమైన ఫలితాలనివ్వడంలో విఫలమయ్యాయి. రాష్ట్రప్రభుత్వాల అభివృద్ధేతర వ్యయం పెరుగుతున్నందువల్ల అభివృద్ధి వ్యయం తక్కువయి... దాని ప్రభావం సామాజిక రంగ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది!!

సాంఘిక భద్రత కల్పించే అన్ని చర్యలు ముఖ్యంగా పేదరిక నిర్మూలనా కార్యక్రమాలతోపాటు విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం లాంటి అంశాలు సామాజిక రంగంగా భావించవచ్చు. దేశవ్యాప్తంగా అక్షరాస్యతా శాతం తక్కువగా ఉన్నప్పటికీ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యాప్తి కోసం చేసే కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. దీని కారణంగా స్థూల జాతీయోత్పత్తి కానీ తలసరి ఆదాయంలో కానీ పెరుగుదల అంత ఆశాజనకంగా లేదు. విద్యారంగంపై చేసే ఖర్చులు, పెట్టుబడులు ఆర్థిక ప్రగతిని వేగవంతం చేస్తాయనడంలో సందేహం లేదు. ఆర్థికాభివృద్ధికీ, సాంస్కృతిక వికాసానికి దోహదపడుతూ... నవీన సాంకేతిక నైపుణ్యాల్ని పుణికి పుచ్చుకున్న సృజనాత్మక శక్తి గల వ్యక్తుల్ని తయారుచేయడం, విద్య ద్వారా సాధ్యమవుతుంది. దేశంలో వస్తు సేవల ఉత్పత్తిలో పెరుగుదల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి, పేదరికాన్ని నిర్మూలించడం కోసం ఆర్థికాభివృద్ధి రేటు వేగవంతమవ్వాలి. ఆర్థికాభివృద్ధి, సామాజిక రంగాలలో అభివృద్ధి ద్వారా మానవాభివృద్ధి సాధించాలంటే... ఆరోగ్యం, విద్య, పౌష్టికత వంటి సామాజిక రంగాలలో పెట్టుబడులు అవసరం. దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగినపుడు సామాజిక రంగ అభివృద్ధికి అవకాశాలు మెరుగవుతాయి.

నిర్మాణాత్మక సంస్కరణలు:

ప్రణాళికా యుగంలో సామాజిక రంగంపై పెట్టుబడులు జాతీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగంపై చేసిన వ్యయం 1980లలో కన్నా.. 1990ల లో తక్కువ. ప్రణాళికా యుగంలో ప్రవేశపెట్టిన అనేక పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు.. మూలధన సాంద్రతను కలిగి, ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయాయి. జూలై 1991 నుంచి ప్రభుత్వం అనేక స్థిరీకరణ కార్యక్రమాలు, నిర్మాణాత్మక సంస్కరణలను ఆర్థిక సంస్కరణలలో భాగంగా ప్రవేశపెట్టింది. విద్యావకాశాలు మెరుగైనందువల్ల అక్షరాస్యత రేటు 1951లో ఉన్న 18.33% నుంచి 1981లో 43.57%కు 2001లో 65.4%కు పెరిగింది. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా ఆరోగ్య సౌకర్యాలు లభ్యం కాకపోయినప్పటికీ.. మొత్తం మీద ఆరోగ్య సౌకర్యాలు విస్తరించాయి. 1990లలో మరణాల రేటు స్థిరపడింది. ఆధునిక వైద్య ప్రక్రియలతో పాటు భారతీయ వైద్యం, హోమియోపతి విధానాలలో వృత్తిపరమైన శిక్షణ పొందిన వారు, అనుబంధ వృత్తుల సిబ్బంది కూడా తమ సేవలందిస్తున్నారు. ప్రజలలో కూడా ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన పెరిగింది. తేలికగా అవలంభించదగిన ఆరోగ్యం పరిరక్షణ ప్రక్రియలు ప్రజలకు బాగా అందుబాటులోకి రావడం వల్ల ప్రజారోగ్య సూచికల విషయంలో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. అయితే, వైద్య సదుపాయాల అందుబాటు విషయంలో వివిధ రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య సమాజంలోని వివిధవర్గాల ప్రజల మధ్య ఎంతో తేడా ఉంది. ఈ కారణంగానే వివిధ రాష్ట్రాల ప్రజల ఆరోగ్య సూచికల విషయంలో ఎంతో తేడా కనిపిస్తోంది. 11వ ప్రణాళిక అప్రోచ్ పేపర్లో... పేదరికాన్ని తగ్గిస్తూ, అందరికీ విద్య, ఆరోగ్య సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రాంతీయ అసమానతలు తగ్గించాలనే లక్ష్యాన్ని ప్రకటించింది.

సామాజిక రంగాలపై పెరిగిన వ్యయం:

సామాజిక రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి వ్యయం.. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో 1990-91లో 6.78% నుంచి 2000-01లో 7.45%కు పెరిగి.. 2006-07 నాటికి 6.04%కు తగ్గింది. సామాజిక సేవలు, గ్రామీణాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వ వ్యయంలో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. గ్రామీణాభివృద్ధితో పాటు సాంఘిక సేవలపై కేంద్ర ప్రభుత్వ వ్యయం మొత్తం వ్యయంలో (ప్రణాళిక, ప్రణాళికేతర) 2001-02లో 11% నుంచి 2007-08లో 16.4%కు పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ మొత్తం వ్యయంలో భాగంగా ఈ రంగంపై చేసిన వ్యయం 2002-03లో 20.4%. కాగా 2003-04లో 19.5%కు తగ్గి, 2006-07లో 22.3%కు, 2007-08లో 22.5%కు పెరిగింది. మొత్తం వ్యయంలో విద్యపై చేసిన వ్యయం.. 2004-05లో 9.8% నుంచి 2006-07లో 10.4%కు పెరిగింది. ఇదేకాలంలో ఆరోగ్యంపై చేసిన వ్యయం 4.4% నుంచి 4.9%కు పెరిగింది. మొత్తం సామాజిక రంగ వ్యయంలో కేంద్రం కంటే రాష్ట్రాల వాటానే ఎక్కువ. రాష్ట్రాల వారీగా పరిశీలించినపుడు ఈ వ్యయం జీఎస్‌డీపీలో ఈశాన్య రాష్ట్రాలలో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. 1990-91లో ఈ రంగంపై వ్యయంలో రాష్ట్రాల వాటా 90.13%. కాగా 2005-06లో 98.93%కు చేరుకుంది. కొన్ని రాష్ట్రాలు మాత్రమే తమ రాష్ట్ర స్థూల దేశీయో

త్పత్తిలో(జీఎస్‌డీపీ) సామాజిక రంగ వ్యయాన్ని పెంచుకోగలిగాయి. మానవాభి వృద్ధి నివేదిక 2007 ప్రకారం... 2004లో మన దేశం జీడీపీలో ఆరోగ్యంపై చేసిన వ్యయం 0.9%. కాగా, చైనా 2%, నైజర్ 2.2%, సియారాలియన్ 19% వ్యయం చేశాయి. విద్యారంగంపై 2002-05 మధ్యకాలంలో మన దేశం చేసిన వ్యయం జీడీపీలో 3.8%. కాగా, పాకిస్తాన్ 2.3%, సియారాలియన్ 3.8% చేశాయి.

2007-08 కేంద్ర బడ్జెట్‌లో పెరిగిన కేటాయింపులు:

2007-08 కేంద్ర బడ్జెట్‌లో విద్య, గృహ నిర్మాణం, పౌష్టికతకు రూ. 83,950.69 కోట్లు కేటాయించారు. 2006-07లో విద్యారంగానికి రూ. 20,745.50 కోట్లు కేటాయించగా.. 2007-08 లో రూ. 28,674 కోట్లు కేటాయించారు. 2007-08 బడ్జెట్‌లో మొత్తం విద్యారంగ కేటాయింపుల్లో.. రూ. 22,191 కోట్లు పాఠ శాల విద్యకు కేటాయించారు. 2008-09 బడ్జెట్‌లో సర్వశిక్షా అభియాన్ పథకానికి రూ.13,100 కోట్లు కేటాయిస్తూ... బోధన నాణ్యత, విద్యార్థుల రిటెన్షన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. మధ్యాహ్న భోజన పథకానికి రూ.8000 కోట్లు, సెకండరీ విద్యకు రూ.4554 కోట్లు కేటాయించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రజలు ఎక్కువగా ఉన్న 20 జిల్లాల్లో జవహర్ నవోదయా విద్యాలయాల ఏర్పాటుకు రూ. 130 కోట్లు, విద్యాపరంగా వెనుకబడిన జిల్లాల్లో బాలికలలో విద్యా వ్యాప్తికి 410 విద్యాలయాలు అదనంగా ఏర్పాటు చేయాలని ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 16 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్, బీహార్, రాజస్తాన్‌లో 3 ఐఐటీలు ఏర్పాటు చేస్తారు. 2008-09 బడ్జెట్‌లో మొత్తం విద్యారంగ కేటాయింపులు రూ. 34,400 కోట్లలో ప్రాథమిక విద్యకు రూ. 19777.50 కోట్లు, సెకండరీ విద్యకు రూ. 4554 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 10852.87 కోట్లు కేటాయించారు. ఆరోగ్య రంగానికి 2008-09 బడ్జెట్‌లో రూ. 16,534 కోట్లు కేటాయించారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌కు రూ. 12,050 కోట్లు కేటాయించారు. 4,62,000 సామాజిక ఆరోగ్య కార్యకర్తలు ఈ మిషన్ ద్వారా శిక్షణ పొందగా... 1,77,924 గ్రామాలలో పారిశుధ్య కమిటీలు ఏర్పాటు చేశారు. 323 జిల్లా ఆసుపత్రుల్లో ఆధునికీకరణ చేపట్టారు. జాతీయ ఎయిడ్స్ నివారణ కార్యక్రమానికి రూ. 993 కోట్లు కేటాయించారు. దారిద్ర్యరేఖకు దిగువన నివశిస్తూ... అసంఘటిత రంగంలో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి రూ. 30000 హెల్త్ కవర్ (ఆరోగ్య బీమా) అందించడానికి వీలుగా రాష్ట్రీయ స్వస్థ్యబీమా యోజనను ఢిల్లీ, హర్యానా, రాజస్తాన్‌లలో ఏప్రిల్ 1,2008న ప్రారం భించారు. 2008-09లో కేంద్ర ప్రభుత్వం తన వాటా ప్రీమియం కింద రూ.205 కోట్లు కేటాయించింది. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్‌కు 2007-08లో రూ. 5293 కోట్లు కేటాయించగా... 2008-09లో రూ. 6300 కోట్లు కేటాయించారు. డిసెంబర్ , 2007 నాటికి 5959 ఐసీడీఎస్ ప్రాజెక్టులు, 9,32,000 అంగన్‌వాడీ, మినీ-అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి.

గ్రామీణ ఉపాధి హామీ పథకం:

సామాజిక రంగ అభివృద్ధికి సంబంధించి అమలులో ఉన్న పథకాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్యమైంది. ఈ పథకం కింద 2007-08లో 2.57 కుటుంబాలకు వేతన ఉపాధి లభించింది. 2007-08లో ఈ కార్యక్రమం అమలుకు రూ.1200 కోట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సౌకర్యాల పెంపుదలలో భాగంగా 2005-06లో ప్రారంభించిన భారత్ నిర్మాణ్ కార్యక్రమంలో ఆరు మౌలిక అంశాలున్నాయి. గ్రామీణ హౌసింగ్, నీటి పారుదల, తాగునీరు, గ్రామీణ రోడ్లు, విద్యుదీకరణ,గ్రామీణ టెలిఫోన్ లాంటి సౌకర్యాల కల్పనలో భాగంగా భారత్ నిర్మాణ్ పథకానికి 2007-08లో రూ. 24,603 కోట్లు కేటాయించారు. రాజీవ్‌గాంధీ జాతీయ తాగునీటి మిషన్ పథకానికి రూ. 5850 కోట్లు కేటాయించారు. పట్టణ పేదలకు మౌలిక సౌకర్యాలతో పాటు, హౌసింగ్, మురికివాడల అభివృద్ధి కోసం ఉద్దేశించిన జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ పథకానికి 2007-08లో రూ. 4987 కోట్లు కేటాయించారు. సహజ, ప్రమాద మరణాలు, పాక్షిక లేదా శాశ్వత డిజబిలిటీ సంభవించిన ప్పుడు గ్రామీణ ప్రాంతాలలో భూమిలేని కుటుంబాలకు సంబం ధించి, కుటుంబ పెద్దకు బీమా కల్పించే చర్యలో భాగంగా 'ఆమ్ ఆద్మీ బీమా యోజన' పథకాన్ని అక్టోబర్ 2, 2007న ప్రారంభించారు. ఈ పథకం కింద ప్రీమియంగా ప్రతి సభ్యుడి నుంచి ఏటా రూ. 200గా నిర్ణయించగా.. దీనిలో 50% కేంద్ర ప్రభుత్వం, మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం కింద నెలకు రూ.200ల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తుంది.

సామాజిక రంగానికి పెరిగిన కేటాయింపులు:

సంస్కరణల యుగంలో రాష్ట్ర ప్రభుత్వాల వృద్ధిరేటులో ఒడిదుడు కులు ఉన్నప్పటికీ.. జీఎస్‌డీపీ వృద్ధి సంస్కరణల ముందుకాలం కన్నా పెరిగింది.

సామాజిక రంగానికి వనరుల పంపిణీ పెంచడంతోపాటు రాష్ట్రాలు తమ విత్త వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం లాంటి చర్య వల్ల జీఎస్‌డీపీ వృద్ధి మెరుగయింది. ఇటీవల బడ్జెట్‌లలో కేంద్ర ప్రభుత్వం సామాజిక రంగానికి కేటాయించే వనరుల పంపిణీలో పెరుగుదల ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లలో ఈ రంగానికి వనరుల పంపిణీలో తగ్గుదల సంభవిస్తోంది. 1950 నుంచి 1980ల మధ్య స్థూలదేశీయో త్పత్తిలో విద్యా రంగానికి సంబంధించి ప్రభుత్వ వ్యయంలో స్తంభన నెలకొనగా.. ఆ తర్వాత కాలంలో ప్రాథమిక విద్యకు సంబంధించి చేసిన వ్యయంలో కొంత మెరుగుదల కనిపించింది. 2006 గ్రామీణ ఆరోగ్య మౌలిక సౌకర్యాల నివేదిక ప్రకారం... 2001 జనాభా లెక్కల ప్రాతిపదికగా.. 19269 సబ్ సెంటర్లు, 4337 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 3206 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయవలసి ఉంది.

ఆరోగ్య సంరక్షణ ఎక్కువగా అవసరమైన గిరిజన ప్రాంతాలు, పట్టణాలలోని మురికి వాడలు, మారుమూల పల్లెల్లో ప్రాథమిక

ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది, సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ, స్వచ్ఛంద, ప్రయివేటు రంగాలలోని అనేక ఆస్పత్రులలో తగినంత సిబ్బంది లేకపోవడం, రిఫరల్ సర్వీసులు పూర్తిగా అందుబాటులోకి రావపోవడం లాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి!!

2001 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో అక్షరాస్యత రేటు?

జవాబు: 65.4 శాతం

2007-08 కేంద్ర బడ్జెట్‌లో విద్య, గృహనిర్మాణం, పౌష్టికతకు కేటాయింపులు?

జవాబు: రూ. 83,950.69 కోట్లు

2008-09 బడ్జెట్‌లో మొత్తం
విద్యా రంగ కేటాయింపులు?

జవాబు: రూ.34,400 కోట్లు

రాష్ట్రీయ స్వస్థ బీమా యోజనను ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్‌లలో ఎప్పుడు ప్రారంభించారు?

జవాబు: ఏప్రిల్1, 2008

ఆమ్ ఆద్మీ బీమా యోజనను ఎప్పుడు ప్రారంభించారు?

జవాబు: అక్టోబరు 2, 2007